# చిరస్మరామి

వీరాజీ

తెల్లవారుతున్నది. భాగీరథీతీరాన యాత్రికులు గుంపులు గుంపులుగా చేరుకొంటున్నారు. బట్టలు మార్చుకొని స్నానోద్యుక్తులౌతున్నారు. కృష్ణయ్యగారు గావంచా కట్టుకొని నీళ్ళలోనికి దిగి, 'హరహర మహాదేవ శంభో శంకర' అని కేక వేసి ఒక్కసారి మునిగిలేచి సంకల్పం ప్రారంభించారు. వయసు మీరినా ఆయన శరీరచ్ఛాయ ముఖవర్చస్సు మాయలేదు. అరుణ పింగళ వర్ణాలతో మిలమిలలాడే తూర్పుదిక్కు ఆయన ముఖంమీద ప్రతిబింబిస్తున్నట్లున్నది. ఉండుండి ఆయన కన్నులు తెరచి గట్టున పెట్టిన సంచీవంక చూసుకొంటున్నాడు. నిశ్చలతకోసం అంత దూరంవెళ్ళినా మనస్సు చలించడానికిగల కారణం కూడా ఆయనతో బాటే వెళ్ళింది.

కొంతసేపయిన తరువాత ఏ ఆరవసారో కన్ను తెరచి చూస్తే, నీటొడ్డున మంచెమీద కూర్చున్న పండా వచ్చీ రాని తెలుగుతో ఎవరినో పిలుస్తున్నాడు. సహజమైన అభిమానంతో అటు చూశాడాయన. నలుగురు స్త్రీలు 'కాసెలు పోసి' చీరలుకట్టి స్నానాలకు వచ్చారు. వాళ్ళను చూసి తెలుగువాళ్ళేనని తెలుసుకోవడం ఆయనకు కష్టం కాలేదు. ఆయన సంకల్పం లేకుండానే సంధ్యకు అంతరాయం కలిగింది. కుతూహలంతో వారివంక చూస్తూ నిలబడ్డాడు.

వాళ్ళు స్నానానంతరం కట్టుకోవలసిన వస్త్రాలను సంచులలోంచి బయటకు తీసిపెట్టుకొని, మంగళసూత్రాలకు పసుపు రాసుకొని, కొప్పుముళ్ళు విప్పుకొని నీళ్ళలోకి దిగుతూ ఉండగా అందులో ఒకరిమీద కృష్ణయ్యగారిదృష్టి పడింది. ఆమెనెక్కడో చూసినట్లుంది. దీక్షగా చూశాడు. కాని గుర్తు రాలేదు. అవమనస్సనకూడా–సభ్యత కాదనిపించే వరకూ చూశాడు. కాని ఎంత ప్రయత్నించినా జ్ఞాపకం రాలేదు. దూరదేశంలో ఉన్నందువలన తెలుగు ముఖం పరిచితంగా కనబడుతున్నదేమో అని సరిపెట్టుకొన్నాడు. కాని మనసు సమాధానపడలేదు. మళ్ళీ చూశాడు. కాని నిష్ప్రయోజనం. 'కొందరి ముఖాలు అంతే. వాటిలో ఎక్కడో అనిర్వచనీయమైన స్నిగ్ధత ఉంటుంది. అవి కళకళలాడుతూ చిరునవ్వులు విరజిమ్ముతూ ఉంటాయి. అందువల్ల వాటిని చూచిన ప్రతివారికి వ్యక్తి సుపరిచితమయినట్లే తోస్తుంది. మనిషిని పోలిన మనుషులుండటంకూడా అసాధారణం కాదు,' ఆయన ఇలాగ అనుకొంటూనే ఉన్నాడు. పెదవులు వాటిఅలవాటున అవి కార్యక్రమం పూర్తిచేసినవి. నీళ్ళలోంచిబయటకువచ్చి, పరిచయభ్రాంతిని గొల్పే ఆవదనాన్ని మరొక్కసారి చూశాడు. ఆమె కన్నార్పకుండా తనవంకే చూస్తున్నది! ఆమె చూడనంతసేపూ ఆయన చూశాడుగాని, ఆమె చూడడం మొదలిడిన తరువాత ఆయన ఇక చూడలేకపోయాడు. "ఏమనుకొంటుందో ఏమో...ఇక్కణ్ణుంచి! అను



